# తెలివి ఒకరి సొమ్మా

## 1

"నువ్వు వాళ్ళమ్మాయిని వెంటేసుకుని తిరుగుతున్నావని చూసినవాళ్ళు చెప్పారు. నీ అసలు ఉద్దేశం యేమిటో నాకు తెలియదు గానీ, వాళ్ళకూ మనకూ తరతరాల వైరం ఉన్నది. ఆచారాలు వేరు, నీకు మంచి సంబంధం చూస్తున్నాము తొందరపడకు" అని తల్లి తులశమ్మ వార్నింగిచ్చింది.

కొడుకు ఫణిభూషణ్‌కి ప్రమోషనొచ్చింది, రాబడీ హోదా పెరిగాయి, అందరకూ నచ్చిన సంబంధంకోసం చూస్తున్నారు.

తండ్రి సూర్యారావుగారు రిటైర్డ్ డి. ఇ. ఒ. వార్తలు వింటూనే వున్నాడు.

వాళ్ళు చేయని అన్యాయం లేదు. ఇంటి, ఇంటిమీద పడి తినటం, డబ్బు చేతిలో పడితే దైవానిక్కూడా వెరవరు. మందు పెట్టి పరలోకానికి పంపి, అది నాచురల్ డెత్ అని భీమా సంస్థని నమ్మించి డబ్బు లాగారు. యెక్కడెక్కడి డబ్బూ చాలదు, నీ సంపాదన యే మూలకి, వాళ్ళమ్మాయిని నెత్తినెక్కించుకో వోకు. నలుగురి నోళ్ళలో నానుతున్నావు, యే గోడ మీద చూసినా, మీ యిద్దరి పేర్లూ కలిపి బొగ్గుతో వ్రాయబడి కంట బడుతున్నాయి. చెడ్డపేరొస్తే మంచి సంబంధం తప్పిపోదూ? తండ్రి సౌమ్యంగానే హెచ్చరించి లైబ్రరీవేపు వెళ్ళాడు.

అదే విధంగా చెల్లీ, తమ్ముడూ, అన్నా, పిన్నీ, మామయ్యా, తప్పు చూపిస్తూ వార్నింగ్ యిస్తూనే ఉన్నారు.

ఆ అమ్మాయి నీతోనే కాదు చాలామందితో తిరుగుతున్నది మామయ్య ఉవాచ.

వాళ్ళమ్మమ్మ యింట్లో అన్నీ అమ్ముతూ డబ్బు చేసు కుంటున్నది, పిన్ని పలికెను.

వాళ్ళ మేనమామ బ్రికెట్ ఆడతాడు.

దాని పినతండ్రి చిట్‌ఫండ్ అని బిజినెస్ పెట్టి మోసం చేసి, దొరికితే దొంగ, దొరక్కపోతే దొర! అనే సామెతలాగా దొర అని పేరు మోశాడు.

దాని పెత్తండ్రి స్కామ్స్‌లో యిరుక్కుని అరెస్టయినాడు.

వీళ్ళకి చాలా తెలుసే. వైరమున్నా వాళ్ళ వివరాలన్నీ తెలుసుకుంటారన్నమాట అనుకున్నాడు ఫణి. అందరికీ నచ్చిన సంబంధం రానే లేదు. తప్పించుకోలేనా అనుకుని ఫణి తన ఆనందం తను చూసుకున్నాడు. దాచినకొద్దీ పైకి వచ్చింది ఆనందానికి మూలం. యెన్ని అబద్ధాలు సృష్టించినా సత్యం దాగదు గదా పైకి వస్తుంది.

ఫణి తండ్రి అయినాడని తల్లిదండ్రిలూ, బంధువులూ విన్నారు. లా ప్రకారం తమనేమీ చేయలేరని సరిపెట్టు కున్నారు. యేది పొక్కినా సంబంధాలు వస్తూనే ఉన్నాయి.

ఫణి భూషణుని చాలా దూరానికి వేశారు, తన స్త్రీనెక్కడో దాచాడని సరిపెట్టుకున్నారాత్మీయులు.

## 2

ఫణికి చిరాకెత్తింది, విసుక్కున్నాడు, చెయ్యి చేసుకో లేదు గానీ, నోటి దుడుకు యెక్కువైంది.

కోమల బాగా అణిగే ఉన్నది. కానీ కోమలకి అన్యాయం తెలుస్తూనే ఉన్నది. చెబితే విన్నాడు గాదు, డామినేట్ చేశాడు, శరించాడు.

మీకు కోపమెందుకొస్తుంది ఆఫీసరుగారూ! నేను మారుమూల పల్లెలో దాక్కునే ఉంటానంటే. చెమిటి మనిషిలాగా చూస్తిరి. తెచ్చి దగ్గర పెట్టుకుంటిరి, నేనైతే మీరిచ్చే దాంతోనే తృప్తిపడి ఉండేదాన్ని. ఇచ్చిందే సరిపెట్టుకోటం నాకు చేతౌను. అహం వలన మీవాళ్ళు చెప్పిన హితమూ తలకెక్కలేదు. నేను చెప్పిన మంచీ చేదైంది, ఇప్పుడనుకునేమిటి లాభం. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నారు అన్నది, నిలబడే ఉన్నది, భోజనం పెడుతున్నది.

ఇంతదూరం యింతమంది రాగలరనుకోలేదు, ఒకళ్ళూ యిద్దరూ వస్తే పంపివేయలేనా, అంత లోభిని కాదే అనుకున్నాను, మీ తండ్రి యీ వూళ్ళోనే మకాం పెట్టారు. దళితులకీ, కోయవారికీ చెట్టుకింద చదువు చెప్పటం తప్పితే మరో జాబ్ గౌరవంగా తోచలేదటనా, జబర్దస్తీ చేసి, ఆఫీస్‌లోనే వ్యాళ్ల యెదుట డిమాండ్ చేస్తారనుకోలేదు. అదేం కల్చర్! నువ్వు మంచి ఘనమైన జాబ్ చూపించూ అదే చేస్తానూ అని విషపునవ్వు నవ్వుతాడు నీ సోదరుడు కోమలవేపు చూడకుండానే అన్నాడు ఫణి.

న్యాయం చూడాలి. మీ తరఫువారూ యింత దూరం వస్తున్నారు. వారు డిమాండ్ చేసినవీ యిచ్చి పంపుతున్నారు, మీది స్వయంకృతాపరాధమే, జోరీగల్లాగా చెవినిల్లు కట్టుకునీ,

కందిరీగల్లాగా కుట్టినా అరిచినా మీ చెవిలో దూరలేదు, పోలీస్ ఆఫీసర్లు మీకు అందుబాటులో ఉన్నారు. యేదో మిష పెట్టి అరెస్ట్ చేయించి కటకటాల వెనక్కు నెట్టండి. 'అవ్వను, లేదు' అని మొహం మీద అనేయండి అన్నది, చివరికొచ్చాడు పెరుగు వడ్డించింది కోమల.

ఇంట్లోనే ఉండి యిదీ చాలా తెల్సుసుకున్నదే. యెవర్లు చెప్పివుంటారు? అని అనుకుని, చిడిముడిపాటుతో పెరుగూ అన్నం సగమే తిని లేచాడు.

వదిలేశారేం? పెరుగు పులిసిందా? అన్నది.

షటప్, పులవలేదు. నీ మాటలే పుల్లగా వున్నాయి. నేనలా అన్నీ ముఖంమీద అనలేనని తెలిసే జబర్దస్తీ చేయ టానికి వెరవటం లేదు. ఈ మాటు బదిలీ వచ్చిందా వెళ్ళి పోతాను. నువ్వూ నీవాళ్ళూ యీ వూళ్ళో ఉండండి, నేనున్న ఊరు రావద్దు, నాకు తోచింది పంపుతాను, అందులోనే నీ వాళ్ళకూ భాగం పెట్టుకో, చేయి తుడుచుకుని బెడ్‌రూమ్ వేపు వెళ్ళాడు. కోమల వెంట వెళ్ళి కోటూ నెక్ టై అందించింది.

మీరు వెళ్ళిపోతే నేను మిగులుతాను ఆఫీసరుగారూ! నేనున్న యీ లంక గవర్న మెంట్ క్వార్టర్స్, ఇది అప్పగించే యద్దూ డెలివరీ వస్తున్నది, పో వేళ డెలివరీకి మరి కొంచెం కావాల్సి వస్తుందేమో, యెవరినడగాలి, మీకే వ్రాయాలా? అటు తిరిగి టై బిగించుకుంటున్నాడు ఫణి, బూట్లూ సాక్సూ తెచ్చి కింద వుంచింది కోమల.

తనంత గొప్పవాడిని గేలిచేస్తున్నదని మండిపోయింది ఫణికి. మా నాన్న చెప్పినట్టు యెక్కడెక్కడి డబ్బూ చాలటం లేదు దీనికి అనుకున్నాడు. ఇటు తిరిగి పడగ విప్పినట్టు చూశాడు. మా నాన్నకు వ్రాయి పంపుతాడు అని కుర్చీమీద కూచుని బూట్లు యెక్కించి లేసులు బిగిస్తు వంగాడు ఫణి.

కోమల అయ్యో! అని నోటిమీద చెయ్యి వేసుకుని, హవ్వ! అని లోపలే అనుకుని,

ఈ యింటిమీద కాకి ఆ యింటిమీద వాలదనేది ఓపెన్ సీక్రెట్ ఆఫీసరుగారూ! పోనీ జాబ్ చూసుకోనా? అన్నది నవ్వాపుకుంటూ.

వీల్లేద్! అని చరచరా వెళ్ళి జీప్‌లో కూచుని చక్రం పట్టాడు ఫణి.

## 3

మళ్ళా కాలం దొర్లింది. సూర్యుడాగుతాడా!

సాయంత్రం వీధి చిమ్మి యింట్లోకి పోతుండగా గేటు చప్పుడైతే వెనక్కు తిరిగింది కోమల. చేతిలో కొండచీపిరి కింద వదిలేసింది. నోటిమీదికి చెయ్యి పోయింది.

ఆ వూరు బాగాలేదూ? భార్యా అనుకూలవతి గాదా? పెళ్ళి చేసుకున్నాడు, చాలా డబ్బుతో వచ్చింది అమ్మాయి అని మీ వాళ్ళూ మావాళ్ళూ అనే పక్షపాతం లేకుండా వార్తలందించారే, ఈ వూళ్ళోనే వుంటిని, పంపింది సరిపెట్టుకుంటిని, యేం పని మీద రావాల్సి వచ్చింది ఆఫీసరుగారూ! అలా అంటూ లోపలికి దారి తీసింది కోమల.

మొదట ఆశ్చర్యపోయినాడు ఆఫీసరు. కోమల చిక్కి శల్యమైంది, మాసిన చీరా రవికా, జుట్టు వూడిపోయింది, తర్వాత దెప్పిందని కోపమొచ్చింది, ఇవేం పరిసరాలో, ఈ యిల్లు యెట్లా పట్టిందో అనుకున్నాడు, అవమానం, ఇది నా వైఫ్ కాదూ? లోపలికి నడిచాడు.

మర్యాదలైనై, దీపాలు వెలిగినై, భోజనం వేళైంది, పీట వాల్చి, అల్యూమినియం పళ్ళెం పెట్టి రుచిగా భోజనం పెట్టింది కోమల. కొడుకు తాను గీసిన బొమ్మలకి వాటర్ కలర్స్ పూస్తున్నాడు. కూతురు పుస్తకం చూస్తు, తాళం వేస్తు చిన్నగా పాడుతున్నది. పక్కగా నులకమంచం దానిమీద పక్క, దానిమీద పాప పడుకుని రెండువేపులా వున్న కుక్కపిల్లి బొమ్మతోనూ, కుందేలు బొమ్మతోనూ, ప్లాస్టిక్ బంతి రంగుల దానితోనూ ఆడుతున్నది, రెండో యేడు.

మంచి యిల్లు చూసుకోకపోయినా లొకాలిటీ బాగాలేదు. తెలివితేటలూ, సమర్థతా యేవీ? అని గేలి చేయాలని ప్రయత్నించాడు.

మంచి యింటికి మంచి అద్దె యివ్వద్దూ? జాబ్ చేసుకోనా అంటే వీల్లేద్! వీల్లేద్! అని వెళ్ళిపోతిరి.

మంచి తిండి తినచ్చుగా. నెయ్యి వాసన చూసి ఉట్టి మీదుంచావా? పచ్చడి మెతుకులు తిన్నావా?

నాకిచ్చినదాంట్లోనే మావాళ్ళకూ భాగం పెట్టుకోవచ్చని అనుమతించి వెళ్లిరి. వాళ్ళ సైకాలజీ తెలుసే మీకూ? ఓసారి రుచి చూశారు.

మా నాన్నకు వ్రాసి తెప్పించుకోలేదూ?

వ్రాశాను, అంతమటుకు మీ ఆజ్ఞ ఉల్లంఘించలేదు. తక్కింది మీరు వెరిఫై చేసుకోండి, నేను మీకు ముందే చెప్పాను దండగ అని.

ఫణి వినబడనట్టు చూశాడు, పదార్థాలు బాగున్నాయి, భోజనం బాగున్నది, లేచాడు, మరునాడు మధ్యాన్నం ప్రయాణమౌతూ అన్నాడు.

నేను నిన్ను తీసికెళ్ళదలచుకున్నాను, నాకు హక్కున్నది, నాకా కన్నడ వంటవాడు వండేవి పడలేదు, నౌకర్లు యిల్లు అందంగా వుంచటం లేదు.

ఆశ్చర్యంగా చూసింది కోమల, వంటవాడెందుకూ? ఆమె వండదా? ఇల్లు అందంగా వుంచదా? అన్నది.

ఆమె యెవరూ? అన్నాడు దేబెలాగా చూస్తూ!

ఈమాటు నవ్వింది కోమల. భార్యా! నన్నెట్లా తీసికెళ్తారు? స్వర్గానికి పోయినా సవితిపోరు తప్పలేదని, నాకు సవితిపోరు రుచి చూపించదలచుకున్నారా? అన్నది.

ఇడియట్! సవితి లేదు, చట్టుబండలు లేదు?

ఇంకా ఆశ్చర్యం! ఆమెనూ తెచ్చుకోరా? పెళ్ళాడారుగా? యేమిటి యిబ్బంది, రానంటుందా?

విసుగ్గా ఛూశాడు ఫణి.

పెళ్ళీ లేదు పెటాకుల్లేదు, పెళ్ళిచూపులనాడు అంతా నిశ్చయం కాబోతుండగా, పెళ్ళికూతురు లేచి బ్లంట్‌గా చెప్పింది నాకు బొల్లి వచ్చింది, వళ్ళంతా పాకుతున్నది, తర్వాత తెలుసుకుని వదిలేస్తారేమో, లాయరెదుట వదిలేయను అని వ్రాసియీయండి. అంత్య నిష్ఠూరం కన్న అది నిష్ఠూరం మేలు.

బొల్లి అయినా కుష్టు అయినా వదలేయను అని వ్రాసి యివ్వాలి అన్నది. దాంతో, అంతా తారుమారైంది, మా వాళ్ళంతా తెల్లబోయారు.

వుంకోటి మంచి సంబంధం కుదురుతుందేమో తొందర పడకండి అన్నది నిదానంగా.

నీ సలహా నాకఖ్ఖర్లా, నేను మా వూరు వెళ్ళి వస్తా తయారుగా వుండు, అలా అని లెదర్ బాగ్ అందించాడు. పిల్లల్ని ముద్దుచేసి వెళ్ళాడు ఫణి.

4

చెప్పేది చెవిన వేసుకోరూ? ఇదివరకోసారి జోస్యం చెబితే పెడచెవిని బెట్టారు. మీవాళ్ళనూ లెక్కచేయలేదు అంటున్నది కోమల. వాలుకుర్చీలో వున్నది. ఫణిభూషణ్ బెడ్ మీదున్నాడు.

యేమిటి నిద్రవేళ నీ నస. రొష్టు పెట్టద్దని చెప్పాను. నామీద నీకధికారం లేదు, నేనే అధికారిని, నీకు స్త్రోమతా లేదు. స్టేటస్సూ లేదు, నన్ను నిద్రపోనీ, ఆఫీస్‌లో పని యెక్కువగా ఉన్నది అని ముసుగుతన్నాడు ఫణి.

పైన సీలింగ్ ఫాన్ తిరుగుతున్నది. చిన్న యెర్రి దీపం గోడకున్న అందమైన ఫ్రేమ్ వెనక వెలుగుతున్నది. నేల మీద చాప, దానిమీద పరుపు, దానిమీద రబ్బర్‌షీట్, దానిమీద మంచి దుప్పటి, దానిమీద నాలుగేళ్ళ బిడ్డ నిద్రపోతున్నాడు, కోమల ఆలోచిస్తున్నది.

తెలివి ఒకరి సొమ్మా తీసిపెట్టుకోటానికి, యెప్పుడు తెలివి వస్తుందో యీ ఆఫీసరుకి? నవ్వితే పూరట కలుగుతుందా? మా

నాన్న వూళ్ళో లేడట, చెతిదండ వద్ద సెప్పిగా ఉన్నదని పట్నంలో డాక్టర్ని కన్సల్ట్ చేయాలని వెళ్ళాడుట, నీ ఉత్తరం అందలేదుట ఆయనకు, అందేదాకా ఉత్తరం పడేస్తూనే ఉండాలి, నీదే తెలివితక్కువ. మా నాన్న చాలా దయగలవాడు అని నిశ్చింతగా నవ్వాడీ ఆఫీసర్.

నౌకరు కూతుర్ని పనిలో పెట్టుకుంటామని అడుగుతున్నారు తాసీల్దారుగారి భార్య. నువ్వు నచ్చ చెప్పి పనిలో పెట్టి నాల్రోజులుండిరా అన్నాడు. వాళ్ళు పెట్టరండీ ప్రతీ దానికీ కులం పోతుంది, పనిపిల్ల అంటారు అని చెప్తే వినిపించుకోకపోగా, తాను స్వయంగా ప్రయత్నించారు. వాళ్ళు లొంగకపోగా ఆ పిల్ల తండ్రినీ తల్లినీ వాటేసుకుని యేడుస్తూ నాకన్నం పెట్టలేరా. నేను మీకు బరువైనానా, పెళ్ళిచేసేయ్ నాన్నా వెళ్ళిపోతాను అన్నదిట. అదంతా అభినయంతో సహా చెప్తూ, అయ్యో! యింత నాటకం వేయాలా? మేము పనిలో పెట్టము అంటే సరిపోలా? అని ఒకటే నవ్వు. ఈమాటే మౌతుందో! మతిలేని మనిషితో సరసమేమిటి, ఆ సైకోతో తిరగద్దు. నిందలు వినలేకుండా ఉన్నాను. అంతగా ఎక్స్ట్రా యెఫేర్సు మీద మోజుపడితే ఆరోగ్యం డబ్బా జాబ్ వున్నా మెకు టోపీ పెట్టండి. మీరే టోపీ పెట్టించుకుంటున్నారు అని కళ్ళ నీళ్ళురికడుతూ నవ్వుతూ సలహా యిచ్చింది కోమల.

నేను తెలివితక్కువ వాడినంటున్నావా? నేనామెను మార్చి, నయం చేయించి దేవతలాగా చేయగలను అంతే, నాకు దురుద్దేశం లేదు. ఇది యెఫేర్ కాదు. నీ తల బిరుసెక్కుతున్నది, వెర్రితలలేస్తున్నది అని వెళ్ళిపోయాడు ఫణిభూషణ్.

## 5

కొడుకు దిలీప్ డిస్ట్రిక్టు ఫస్ట్ వచ్చాడట. ఫణిభూషణ్ టీపార్టీ యిచ్చాడు. లానెస్‌మీద కుర్చీలలో అతిధులు నిండి పోయారు. కోమల ఒకకుర్చీలో వున్నది. పక్కనున్న శిరీష సి టి వో భార్య, ఇంరాజిరానీ అనేఆమె ఇండస్ట్రియలిస్టుభార్య. వాళ్ళిద్దరూ పలకరిస్తుంటే జవాబు లిస్తున్నది కోమల.

ఫణిభూషణ్ లాన్స్‌మధ్య నిలబడి అందర్నీ పలకరిస్తూ నవ్వుతూ నవ్విస్తూ యేదో చెపుతున్నాడు. టూ స్వీట్స్ టు హాట్స్, ఐస్ క్రీమ్, కాఫీ సర్వ్ చేస్తున్నారు ప్యూన్స్.

" అయ్యో! అలా చేస్తుందనుకోలేదు. మెడిసిన్స్ కిటికీ లోంచి అవతలకి పారేసి, తీసుకుంటున్నానని నమ్మించింది. ఫెన్సు పక్కన పడివున్న మందుసీసాలు ఆయా, నౌకరు తెచ్చి చూపారు. మంచి బిల్డింగ్‌లో వుంచితే, విశ్రాంతిగా సంతో షంగా వుండి ట్రీట్‌మెంట్ పనిచేస్తుందని వుంచితే, అయ్యో! అద్దెచెల్లించక బకాయిపడింది. అదంతా నే చూసుకుంటానన్నా నుట. ఆ యింటి యజమాని నాముక్కుపిండి ఆర్నెల్ల అద్దె లాగాడు. నేనేట అక్కడుంచింది. నేనే బాధ్యుడినట. " అని నవ్వుతున్నాడు.

" మీరు డాక్టరిచ్చిన వార్నింగ్ తీసుకోలేదు సార్! ముద్దు చేయొద్దు, లొంగద్దు. ఆమె చెప్పినట్లు ఆడద్దు. ఆమె పన్లన్నీ ఆమే చేసు కోవాలి. మెల్లిగా అలవాటౌతుంది. " అని సలహా యిస్తే మీరు పాటించలేదు. " అని డి ఐ జి నవ్వుతూ కాఫీ తాగుతున్నాడు.

((○))

" అంతా ! అంతెక్కి పోతుందనుకోలేదు. దయగా స్నేహంగా వుంటే సంతోషిస్తుందనుకున్నా. ఆ చుట్టు పట్లంతా అప్పులు చేసింది. నన్నడిగి వసూల్ చేసుకోమన్నది. యేదో సొమ్మెత వున్నదే. మంచికిపోతే చెడెదురైందని, అలాఅయింది. ఆఫీసు కొచ్చేసింది. తెయ్యమని అట. ఇన్‌డీసెంట్‌గా ప్రవర్తిస్తే పూర్ఫన్స్ దిమ్మెరపోయారు ఇంక నోరు విప్పిందంటే అక్కడున్న వాళ్లంతా పారిపోవాల్సిందే. ఇంటి తలుపులు మూయకుండా సినిమా కెళ్లింది. ఇంట్లో టి పి ఆపేయ లేదు. ఇంటి వారొచ్చి ఆపేశారు. వాళ్లూ గెలవలేక యిల్లు ఖాళీచేయమన్నారుట. " ఇది నామరిదియిల్లు వాడు ఆఫీసరు. మిమ్మల్నందర్నీ జైల్లో పెట్టిస్తాడు. " అలా అంటూ యేదందితే అది వాళ్లమీద విసిరేసిందిట. కొంత మందికి గాయాలైనై. ఆమె ఆత్మీయులూ తగ్గవారే. సంచీ నిండుగా వున్నన్నాళ్లూ దగ్గరుంది, సంచీ ఖాళీకాగానే యెవరిదోవనవారు చల్లగా జారుకున్నారు. " అలా చెప్తున్నాడు ఫణిభూషణ్.

వింటున్నవాళ్లు యెంజాయ్ చేస్తూ యెంకరేజ్ చేస్తున్నారు.

" చివరికి పెద్ద టోపీయే పెట్టింది నాకు. సివిల్ మారేజ్ చేసుకున్నామని సర్టిఫికేట్ చూపించిందట. ఆ యెపార్ట్‌మెంట్ ఖాళీచేయాలి. ఆ సర్టిఫికేట్ ఫోర్జరీ అని ప్రూవ్ చేయాలినేను. అని కదిలిపోతూ, చప్పట్లుకొట్టి నవ్వుతున్నాడు ఫణిభూషణ్.

కోమలా వింటున్నా దిదంతా.

" ఇప్పుడేవస్తా. " అంటూ స్త్రీలమధ్యనించి లేచి వెళ్ళిపోయింది.

(((०)))